సాక్షి
విజయనగరం

సోమవారం । 20 । నవంబర్ । 2023



పంటకోత ప్రయోగం

ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే అధికంగానే వరి పంట సాగైంది. ఆలస్యంగా వేసిన ప్రాంతాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. - 8లో



సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాగు బాట

సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన యువ ఇంజినీర్ అనంతబాబు తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి సొంత గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. - 8లో



యాప్‌లతో దా'రుణం'

సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో దారి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలి తీసుకుంటోంది. - 8లో

న్యూస్‌రీల్

తగ్గిన 'మడ్డువలస' నీటి మట్టం



ప్రాజెక్టు వద్ద 62.10 మీటర్ల నీటి నిల్వ

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. శనివారం ప్రాజెక్టు వద్ద 62.10 మీటర్ల నీటి మట్టం నమోదైంది. వాస్తవానికి ప్రాజెక్టు కెపాసిటీ 65 మీటర్లు లెవెల్ ఉండాల్సి ఉండగా అధికారులు నీటి నిల్వలను తగ్గిస్తున్నారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 778 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఒక గేటు ఎత్తి 1410 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచి పెడుతున్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి అవసరాల కోసం 700 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు భూములకు మళ్లిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ప్రాజెక్టు వద్ద 62.10 మీటర్ల లెవెల్ నీటి నిల్వ నమోదైంది.

పది వేల టన్నుల చెరకు క్రషింగ్



ఫ్యాక్టరీకి తరలించేందుకు ట్రాక్టర్‌కు ఎక్కిస్తున్న చెరకు

రేగిడి : మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇప్పటి వరకూ పది వేల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు అసోషియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి ఆదివారం వెల్లడించారు. విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి చెరకును నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలు తీసుకొచ్చినట్టు వెల్లడించారు. కటింగ్ ఆర్డర్లు పొందిన రైతుల పొలాల్లో వీరు కాంట్రాక్ట్ ప్రాతిపదికన చెరకును నరికి ఫ్యాక్టరీకి అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం చేసుకున్నామని పేర్కొన్నారు.

భారతదేశ గొప్పతనాన్ని చాటిన ధీశాలి ఇందిరాగాంధీ

- డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్‌కుమార్ తదితరులు

విజయనగరం ఫోర్ట్: భారతదేశ గొప్పతనాన్ని చాటిన ధీశాలి ఇందిరాగాంధీ అని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశాన్ని సమర్థవంతంగా పాలించిన వీర వనిత ఇందిరాగాంధీ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ విద్యతో ఉత్తమ పరివర్తన



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌జీఎస్ అకాడమీ డైరెక్టర్ ఎస్.రామ్

విజయనగరం అర్బన్: సైనిక్ స్కూల్‌లో విద్యాబోధనలతో విద్యార్థుల్లో ఉత్తమ పరివర్తన సాధ్యమని ఎస్‌జీఎస్ సైనిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్.రామ్ అన్నారు. సైనిక్ స్కూల్‌లో విద్యాబోధనలపై తల్లిదండ్రులకు స్థానిక అకాడమీ ప్రాంగణంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 33 సైనిక్ స్కూళ్లు ఉన్నాయని వాటిలో విద్యాబోధన ఆదర్శంగా ఉంటుందన్నారు. ఒత్తిడి లేని విద్యా బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసానికి, క్రీడలు, క్లరికల్ ఏక్టివిటీలకు ప్రాధాన్యత ఇస్తారని రామ్ అన్నారు. ప్రవేశ పరీక్ష రాసే ముందు ఆయా స్కూళ్ల నిర్వాహణ వాతావరణాన్ని విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కలిగిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రభుత్వ మద్దతు



రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాల అండగా నిలుస్తోంది. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తూ ఆర్‌బీకేల ద్వారా విత్తనం నుంచి ఎరువులు, పురుగు మందులు అందజేస్తూ సాయం చేస్తోంది. పంట దిగుబడులను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చింది. దీంతో రాష్ట్రంలో ప్రతి ఒక్క రైతు సంబరపడుతున్నాడు.



- ఏటా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- నాలుగేళ్లలో 15.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులకు రూ.2990.61 కోట్ల చెల్లింపు
- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

విజయనగరం ఫోర్ట్:

అన్నదాత ఆరుగాలం పండించిన పంటకు మద్దతు ధర వస్తే ఆనందంగా ఉంటాడు. దీన్ని గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారు ఆనందంగా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టింది. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూ వారికి అవసరమైన సాయాన్ని అందిస్తోంది. పంట సాగుకు అవసరమైన విత్తు దగ్గర నుంచి ఎరువు వరకు రైతుకు ప్రభుత్వం అందిస్తోంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లే పరిస్థితి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తోంది. పంట సాగుకు అవసరమైన పెట్టుబడికి కూడా ప్రభుత్వం ప్రతి ఏటా వైఎస్సార్ రైతు భరోసా పేరిట ఆర్థిక సాయం అందిస్తోంది. రైతు పండించిన పంటను కూడా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తోంది. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయడం రైతులకు మద్దతు ధర లభిస్తోంది.

గడిచిన నాలుగేళ్లలో ధాన్యం కొనుగోలు, చెల్లించిన నగదు వివరాలు...

సంవత్సరం	కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో..)	రైతుల సంఖ్య	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో..)
2019 - 20	4,52,045	47,365	829.16
2020 - 21	4,60,384	58,376	869.19
2021 - 22	3,06,712	61,562	595.01
2022 - 23	3,41,880	89,947	697.25

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

ఈ క్రాప్, ఈకేవైసీ చేసుకున్న ప్రతి రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతులు సాగు చేసిన పంట వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారు. పంట పండిన తర్వాత రైతులకు పంటను విక్రయించుకోవడానికి అవసరమైన షెడ్యూల్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారు. దీని వల్ల రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి మద్దతు ధర లభిస్తోంది. జిల్లాలో 551 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

నాలుగేళ్లలో 15.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం 15,61,021 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. దీనికిగాను రూ.2990 కోట్లు ప్రభుత్వం రైతులకు చెల్లించింది.

దళారుల దందాకు చెక్

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కాకముందు ధాన్యం కొనుగోలులో దళారులు దందా కొనసాగేది. దళారుల వల్ల రైతులకు ఇబ్బంది జరుగుతుందని భావించిన ప్రభుత్వం వారి ఆధిపత్యానికి పూర్తిగా అడ్డుకట్ట వేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసి రైతుల కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి వారికి సకాలంలో డబ్బులు చెల్లిస్తోంది. దీని వల్ల రైతులంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలకే ధాన్యం విక్రయిస్తున్నారు. 82 కేజీల ధాన్యం బస్తాకు రూ.1640 ధర ఉన్నప్పుడు దళారులు రూ.1250, రూ.1300లకే కొనుగోలు చేసేవారు. దీని వల్ల రైతులు బస్తాకు రూ.340 నుంచి రూ.440 వరకు నష్టపోయేవారు. 100 నుంచి 200 బస్తాల వరకు విక్రయించే రైతులకు రూ.వేలల్లో నష్టం జరిగేది. ప్రభుత్వానికి విక్రయించడంతో ప్రభుత్వం ప్రకటించిన పూర్తి మద్దతు లభిస్తోంది. దీంతో రైతులు ఆనందంగా ఉంటున్నారు.

ప్రతి ఏటా కొనుగోలు కేంద్రానికే ధాన్యం



నేను మూడు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ప్రతి ఏటా ఖరీఫ్‌లో వరి పంట సాగు చేస్తున్నాను. ప్రభుత్వం నాకు కౌలు గుర్తింపు కార్డు కూడా ఇచ్చింది. ఆ కార్డు ద్వారా ధాన్యం విక్రయించుకుంటున్నాను. ఏటా 60 నుంచి 70 బస్తాల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రానికి విక్రయిస్తున్నాను. ప్రభుత్వం సకాలంలో నా బ్యాంకు ఖాతాలో ధాన్యం డబ్బులు వేస్తోంది. - ఎం.సత్యనారాయణ, కౌలు రైతు, పినవేమలి గ్రామం

పూర్తి మద్దతు ధర లభిస్తోంది



రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించడం వల్ల రైతులకు పూర్తి స్థాయి మద్దతు ధర లభిస్తోంది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది కూడా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసాం.

-వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి



ధాన్యం కొనుగోలు చేస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది (ఫైల్)

ఆర్టీసీ 'పంచారామ' సర్వీసులు ప్రారంభం



పంచారామ సర్వీసులను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: కార్తీక మాసంలో శైవ పుణ్య క్షేత్రాల దర్శనాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచారామ సర్వీసులు ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు జెండా ఊపి బస్సుల సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ మూడు బస్సులకు సరిపడా ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవడంతో తొలి రోజున మూడు సర్వీసులను నడిపామని అన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు బయలుదేరిన ఈ సర్వీసులు ఐదు క్షేత్రాలను సందర్శించి సోమవారం అర్ధరాత్రికి బయలు దేరిన చోటకి తిరిగి వస్తాయన్నారు. సందర్శించే పుణ్య క్షేత్రాలలో అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షరామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కొమరలింగేశ్వరుడు) ఉన్నాయన్నారు. ఇదే విధంగా ఈ నెల 26, వచ్చే నెల 3, 10వ తేదీలలో ప్రత్యేక సర్వీసులు నిర్వహిస్తామని తెలిపారు. సర్వీసులో ఒక్కొక్కరికీ ఆల్ట్రా డీలక్స్ సర్వీసులకు కేవలం రూ.1,900, సూపర్ లగ్జరీ సర్వీసులకు రూ.1,950 మాత్రమే చార్జీలు ఉంటాయన్నారు. టిక్కెట్ బుకింగ్ కోసం 'ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఐఎన్' లాగిన్ లో పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా దగ్గరలో ఉన్న డిపోకి వెళ్లి టిక్కెట్లను బుక్ చేసుకొనే సౌకర్యం కూడా ఉందన్నారు. పూర్తి వివరాల కోసం 99592 25620, 94943 31213, 73829 23683 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ, ఎఫ్ఎం హేమంత్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి దర్శనం..
సర్వపాప హరణం

- సంగాంలో బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం
- అలహాబాద్ తరహాలో త్రివేణి సంగమం ప్రత్యేకత
- నేడే తొలి కార్తీక సోమవారం



బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం

వంగర: అక్కడ శివలింగ దర్శనం సర్వపాప హరణం. కార్తీక మాసంలో సంగమేశ్వరుడిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వంగర మండలం సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి దేవాలయానికి కార్తీకమాస వేళల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ద్వాపర యుగంలో బలరాముడు ఏకకాలంలో ప్రతిష్ఠించిన ఐదు శివలింగాల్లో ఇక్కడిదొకటి. అందువలన ప్రత్యేకత సంతరించుకుంది.

త్రివేణి సంగమం స్నానం పావనం

ఈ ఆలయ ప్రాంగణంలో నాగావళి, సువర్ణముఖి, వేగావతి మూడు నదులు కలిసే కూడలి ఉంది. ఈ ప్రాంతం త్రివేణి సంగమంగా గుర్తింపు పొందింది. ఇక్కడ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ తరహాలో ఈ ప్రదేశంలో మూడు నదులు కలిసే కూడలి ఉంది. సంగమేశ్వస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తులు ప్రగాఢ విశ్వాసం. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్తీక మాసంలోని అన్ని రోజుల్లో భక్తులు ఇక్కడకు వచ్చి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి సంగమేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటారు.

పితృదేవతలను స్మరించే స్థలం

మూడు నదులు కలిసే త్రివేణి సంగమం ఒడ్డున పితృదేవతలకు కూడా ప్రత్యేక పూజలు అర్పిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 400 సంవత్సరాల నాటి భారీ మర్రి వృక్షం ఉంది. ఈ చెట్టు నీడన వంటా వార్పు చేసి త్రివేణి సంగమంలో పితృదేవతలకు పిండ ప్రధానాలు చేస్తారు. అలా చేస్తే మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని భక్తులు నమ్ముతారు.

ఇలా చేరుకోవాలి..

రాజాం పట్టణానికి 23 కిలోమీటర్ల దూరంలో సంగాం ఉంది. వంగర, రుషింగి, కొప్పర గ్రామాలకు వెళ్లే బస్సులు ఎక్కితే మెట్ట మగ్గూరు వద్ద దిగి అక్కడ నుంచి ఆటోలో సంగాం చేరుకోవచ్చు. ఉదయం 7.15, 8.00, 9.00, 11.00 గంటలకు, మధ్యాహ్నం 3, 4.30, 6గంటలకు రాజాం కాంప్లెక్స్ నుంచి బస్సులు ఉన్నాయి. అదే విధంగా రాజాం నుంచి సంగాం వరకు ఆటోలు కూడా విరివిగా ఉంటాయి. 50 నిమిషాల ప్రయాణం ఉంటుంది.

ఎం.సీతారాంపురంలో 108 స్తంభాల ఆలయం

ఇక్కడ 108 స్తంభాల శివాలయం ప్రసిద్ధి. 450 ఏళ్ల క్రితం దీనిని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వారు నిర్మించారని పూర్వీకులు చెబుతారు. ఆలయం లోపల ఉన్న 108 స్తంభాలతో గుడి గోపురం ఇమిడి ఉంది. ఆలయ కుడ్యాలపై వెలసిన దేవతామూర్తులు విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. దీంతో కార్తీక మాసంలో పూజల కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



వరల్డ్ కప్ సందడి

క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వేళ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానుల సందడి నెలకొంది. జిల్లాలో ఎక్కడికక్కడ స్క్రీన్స్ ఏర్పాటు చేసి అభిమానులు క్రికెట్ మ్యాచ్‌ను ఆసక్తికరంగా చూసారు. భారత్ విజయం కోసం పరితపించారు. అతిథ్య ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ఆసక్తిగా వీక్షించారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రింగ్ రోడ్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయగా... నగరంలోని మహిళా పార్కులో మహిళల కోసం, ఐనాక్స్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం వద్ద భారీగా యువత వీక్షించారు. - విజయనగరం



విజయనగరంలో స్క్రీన్‌పై మ్యాచ్‌ను ఆసక్తికరంగా తిలకిస్తున్న యువత (ఇన్‌సెట్లో) క్రికెట్ అభిమానుల సందడి

సామాజిక సాధికారత
సీఎం జగన్‌తోనే సాధ్యం

- బొబ్బిలిలో 23న జరిగే బస్సు యాత్రకు తరలి రావాలి
- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి
- సన్నాహాక సమావేశాల్లో నేతలకు పిలుపు



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: బొబ్బిలిలోని శ్రీ కళాభారతి వద్ద ఈ నెల 23న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సామాజిక సాధికార బస్సు యాత్ర జయప్రదం చేసేందుకు ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేసారు. ఆయా మండలాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ నాయకులతో పాటు, బొబ్బిలి, తెర్లాం మండలాల పార్టీ ముఖ్య నాయకులతో ముందస్తు సమావేశాలు నిర్వహించారు. బాడంగి, రామభద్రపురం మండల కేంద్రాల్లోనూ నిర్వహించిన ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక వర్గాలకు పెద్ద పీట వేసి వారి మనుగడను ముందుకు తీసుకువచ్చి పెద్ద ఎత్తున పదవులు కల్పించి వారిని గౌరవ ప్రదంగా నిలబెట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం, గ్రామ స్వరాజ్యం సిద్ధించిన విషయం అందరికీ తెల్పిందేనని, ఇదే విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. బస్సు యాత్ర రోజున రామభద్రపురంలో విలేకరుల సమావేశం నిర్వహించి బైక్ ర్యాలీతో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌కు వెళతామన్నారు. సామాజిక సాధికారత ఎలా సంక్రమించింది, ఎవరెవరికి ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందన్న విషయాన్ని ప్రజాప్రతినిధులు వివరిస్తారన్నారు. అక్కడి నుంచి పట్టణంలోకి ర్యాలీగా వెళ్లి సాయంత్రం నిర్వహించే బహిరంగ సభకు జనం తరలి రావాలన్నారు. ఈ బహిరంగ సభకు నియోజకవర్గంలోని మారుమూల పల్లెల నుంచి కూడా భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చేలా చేయాల్సిన బాధ్యత నాయకులదేనన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ పట్టణంలోని ప్రతీ వార్డు నుంచి లబ్ధిదారులు తరలి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఉన్న ఆయా వర్గాలను తరలించాలన్నారు. పట్టణ, మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు చోడిగంజి రమేష్ నాయుడు, ఉత్తరావిల్లి అప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, అప్పికొండ లక్ష్మునాయుడు, అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగో పాలనాయుడు, బొమ్మినాయుని వెంకటనాయుడు, తెంటు సత్యంనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, పెద్దింటి రామారావు, తెంటు మధు, యువ నాయకులు శంబంగి శ్రీకాంత్, జడ్పీటీసీ సంకిలి శాంతకు మారి, మున్సిపల్ ఏఎంసీ వైస్ ఛైర్మన్లు చెలికాని మురళి, తెంటు పార్వతి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెదరగొడుతున్న ఏనుగులు



ఏనుగుల గుంపును తిలకిస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని గజపతినగరం సమీపంలోకి ఆదివారం ఏనుగుల గుంపు చేరుకుంది. గ్రామసమీపంలోని పంటలను ధ్వంసం చేస్తూ, తినివేస్తూ ప్రయాణం సాగిస్తున్నాయి. ఏబీ రోడ్డు పక్కన నాలుగు ఏనుగులు తిష్ఠ వేయడంతో ప్రజలు, వాహన దారులు బెదిరిపోతున్నారు. ఏనుగుల బారి నుంచి పంట నష్టాన్ని తప్పించాలని రైతులు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర జట్టు సభ్యులకు ప్రోత్సాహకం



స్కూల్‌గేమ్స్ రాష్ట్రజట్టు క్రీడాకారులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అండమన్ నికోబార్ దీవుల్లో డిసెంబర్ 4వ వారంలో జరిగే స్కూల్ గేమ్స్ అండర్–17 ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ఆడనున్న ముగ్గురు క్రీడాకారులకు సీతం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రోత్సాహకాలు అందజేసి ఆదివారం ఘనంగా సత్కరించింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని ఈ పోటీలలో ప్రతిభ చూపిన పట్టణానికి చెందిన బూర్లి జయ సూర్య, ఆదుర్తి చైతన్య, కేసలి ఝాన్సీరాజ్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలుసుకుని సత్కరించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మజ్జి శశిభూషణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' బృందం పర్యటన

• ఉద్యోగావకాశాలపై అవగాహన

విజయనగరం అర్బన్: డిగ్రీ చదువులు పూర్తయిన తరువాత ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయో అవగాహన కలిగించడానికి ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' సంస్థ ప్రతినిధులు జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో పర్యటిస్తారని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ) మజ్జి ఆదినారాయణ ఆదివారం తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు 'హెచ్‌సీఎల్‌టెక్‌బీఈఈ.కాం' వెబ్‌సైట్‌లో పేర్లను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత అన్ని మేనేజ్‌మెంట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు స్పందించిన విద్యార్థులతో పేర్లను నమోదు చేయించే ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సాయికిరణ్ 96429 73350, గురునాథ్ 77807 54278, యుగేష్ 63003 78377 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రారంభమైన పంటకోత ప్రయోగం

• 400 హెక్టార్లలో పూర్తయిన కోత
• జిల్లాలో 93,820 హెక్టార్లలో వరిసాగు



విజయనగరం మండలం పినవేమలిలో వరి పంటను కోస్తున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే అధికంగానే వరి పంట సాగైంది. ఆలస్యంగా వేసిన ప్రాంతాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అన్నిమండలాల్లో వరి పంటను రైతులు కోస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంటను కుప్పలుగా పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగాలు చేపట్టారు. పంట కోత ప్రయోగాల ప్రకారం ,ధాన్యం ఎంత దిగుబడి వస్తుందో వ్యవసాయ అధికారులు అంచనా వేస్తారు.

217 పంట కోత ప్రయోగాలు పూర్తి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు వ్యవసాయ అధికారులు 217 పంట కోత ప్రయోగాలు చేశారు. మొత్తం 2024 పంట కోత ప్రయోగాలు చేయాల్సి ఉంది. చివరి దశలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో అధికంగానే దిగుబడి వస్తుందని, ఇప్పటివరకు చేసిన పంటకోత ప్రయోగాల్లో ఎకరాకి 28 నుంచి 29 బస్తాల దిగుబడి రావచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఎకరాకి 27 నుంచి 28 బస్తాల దిగుబడి వచ్చింది.

93,820 హెక్టార్లలో సాగు

జిల్లాలో వరి పంట సాధారణ విస్తీర్ణం 90, 235 హెక్టార్లు కాగా దాని కంటే అధికంగానే 93, 820 హెక్టార్లలో సాగైంది. పంటకోత ప్రయోగాలను రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు వ్యవసాయ అధికారి సమక్షంలో చేస్తున్నారు.

హెక్టారుకు 5000 నుంచి 5100 కేజీల ధాన్యం

హెక్టారుకు 5000 నుంచి 5100 కేజీల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా 4.63 లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని అభిప్రాయపడుతున్నారు.



గజపతినగరం మండలంలోని కొత్త బగ్గాంలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎకరాకు 29 బస్తాల దిగుబడి

పంట కోత ప్రయోగాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాం. ఇప్పటికే 217 పంటకోత ప్రయోగాలు పూర్తి చేశాం. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇప్పటివరకు చేసిన పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 29 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులు ధాన్యం విక్రయించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

వి.తారకరామారావు,
జిల్లా వ్యవసాయ అధికారి


ఈ నెల 30లోగా పోర్టల్‌లో నమోదు చేయాలి

• డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్



పార్వతీపురం టౌన్: ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్‌ఎంఎన్‌ఎస్ పరీక్ష 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, విద్య, మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్కుల్లో ఉండేవిధంగా పోర్టల్‌లో నవంబర్ 30 లోగా నమోదు చేయాలని సూచించారు. సంబంధిత పాఠశాలల మోడల్ అధికారి డిసెంబర్ 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాల నమోదు తీరును పరిశీలించాలని పిలుపునిచ్చారు. నమోదు చేసిన అప్లికేషన్ ప్రింట్ తీసి దాంతోపాటు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు, అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీ జతపరిచి డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని వివరించారు. జిల్లా మోడల్ అధికారి లాగిన్ ద్వారా వెరిఫై చేయించుకున్న అప్లికేషన్లకు మాత్రమే స్కాలర్‌షిప్ మంజూరవుతుందని స్పష్టం చేశారు. గతంలో ఈ పరీక్షకు ఎంపికై ప్రస్తుతం 10,11,12 తరగతులు చదువుతూ అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

రామతీర్థంలో వైభవంగా నిత్య పూజలు



వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం లోని సీతారామ స్వామి దేవస్థానం లో నిత్య పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఆదివారం అత్యంత వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హోమం, ఆదిత్య హృదయం, సుదర్శన అష్టకం, సుదర్శన హవనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద సీతారామస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్తీకమాసం ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబసమేతంగా అధిక సంఖ్యలో రామతీర్థం విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. పలువురు సందర్శకులు బోడికొండ పైకి వెళ్లి సందడి చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

గ్రోత్ సెంటర్‌లో రోడ్ల మరమ్మతు



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ జోనల్ మేనేజర్ తదితరులు

బొబ్బిలి: బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో అంతర్గత రహదారుల మరమ్మతులను ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ బడగల హరిధర రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ రహదారుల స్థానంలో రూ.5.50కోట్లతో కొత్త రహదారుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆ నిధులు వచ్చేలోగా ఈ రోడ్లకు ఇప్పుడు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో కన్నా ఇప్పుడు హెవీ వెహికల్స్ తిరుగుతుండడంతో రహదారులు మరమ్మతులకు గురైన నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతు చేయిస్తున్నామన్నారు.

గ్యాస్ లీకై పేలిన ఇల్లు

• ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురికి తీవ్ర గాయాలు



గ్యాస్ లీక్‌తో బ్లాస్టయిన శ్లాబ్‌ఇల్లు



పూర్తిగా ధ్వంసమైన ఇల్లు, సామగ్రి



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

లక్కవరపుకోట: గ్రామంలోని గవరవీధిలో గ్యాస్ లైకై ఒక ఇల్లు పూర్తిగా పేలిపోయి శ్లాబ్ మొత్తం కూలిపోయింది. ఆ ఇంటి పరిస్థితి బీభత్సంగా మారిపోయి ఇంట్లో నుంచి క్షతగాత్రుల ఆర్తనాదాలు వినిపించడంతో గ్రామస్తులు హతాశులయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. 10 రోజుల క్రితం పూసపాటిరేగ మండలం నుంచి వలస వచ్చిన తామరాపల్లి వెంకటలక్ష్మి(50), ఆమె కుమార్తె కెల్ల శ్రావణి (30) ఆమె పిల్లలు మోహన్ (10), లాస్య(8), శ్రావణి అన్న కుమార్తె ప్రణవి(7) గవర వీధిలోని ఓ ఇంట్లో అద్దెకు దిగారు. కాగా శనివారం రాత్రి గ్రామంలో గల బంధువుల ఇంట్లో భోజనం చేసి అద్దెకు తీసుకున్న ఇంటికి వచ్చి నిద్రపోయారు. అయితే ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో వెంకటలక్ష్మి నిద్రలేచి టీ పెట్టేందుకు వంట గదిలోకి వచ్చి లైట్ వేసేందుకు స్విచ్ ఆన్ చేసింది. క్షణాల్లో పెద్ద శబ్దంతో ఇల్లు మొత్తం పేలిపోయింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. ఇల్లు పేలిపోతున్న సమయంలో వచ్చిన కొద్దిపాటి మంటల్లో ముగ్గురు చిన్నారులతో పాటు వెంకటలక్ష్మి, శ్రావణిల బట్టలు పూర్తిగా కాలిపోయి గాయాల పాలయ్యారు. ఈ ఇల్లు పేలిపోవడంతో పాటు చుట్టుపక్కల గల 8 ఇళ్ల గోడలు బీటలు వారాయి. బాత్‌రూమ్‌లు ధ్వంసం కాగా కిటికీల అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. ఇల్లు పేలిన శబ్దం, క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న ఇరుగుపొరుగువారు వెంటనే వచ్చి చూసి క్షతగాత్రులను ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి హుటాహుటిన 108 వాహనంలో ఎస్.కోట తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. వెంకటలక్ష్మి, శ్రావణిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాద సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో ప్రమాద స్థలానికి వచ్చి గ్యాస్ ధాటికి పేలిపోయిన ఇంటి పక్కనే గల గడ్డివాము కాలిపోతుండడంతో ఆర్పివేశారు. అనంతరం ఫైర్ ఆఫీసర్ ఎస్‌కె.మదీనా మాట్లాడుతూ గ్యాస్ లీక్ అయి ఆ గదిలో తలుపులు, కిటికీలు మూసివేసి ఉండడంతో గ్యాస్ నిండిపోయివదని, అంతలో స్విచ్ ఆన్ చేయగానే వచ్చిన స్పార్క్‌కు ఒక్కసారిగా ఇల్లు పేలిపోయినట్లు తెలిపారు. ప్రమాద వార్త తెలుసుకున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఆమె భర్త రాంప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు.

ఫోన్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే కడుబండి

విజయగరంలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు పరామర్శించి ఆమె రికాలో ఉన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు క్షతగ్రాతుల పరిస్థితిని వివరించడంతో ఎమ్మెల్యే స్పందించి క్షతగాత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరింతగా ఆదుకునేందుకు కృషి చేస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాగు బాట

• విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం
• వరితో పాటు కూరగాయల సాగు



అరుదైన కాలాబట్టీ రకం వరి పంటకోత ప్రయోగం చేస్తున్న యువ ఇంజనీరు అనంతబాబు, ప్రకృతివ్యవసాయం సిబ్బంది

పూసపాటిరేగ: సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ పోతినిండి అనంతబాబు తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి సొంత గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సొంత ఊరిలో వ్యవసాయం చేస్తూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు లేకుండా ధాన్యంతో పాటు వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఆరోగ్యంగా ఉండాలంటే వైద్యులు సైతం సేంద్రియ సాగుతో చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించడంతో ఆయా పంటలకు బాగా గిరాకీ పెరిగింది. గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పండించిన పంటలను తమ ఇంటి వద్ద నుంచే ఆరోగ్యసమస్యలున్న వారికి నామమాత్రపు ధరకే ఆయన విక్రయిస్తున్నారు. ప్రకృతిసాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో గ్రామాల్లో ప్రకృతిసాగుపై రైతులకు ఆసక్తి పెరిగింది.

అరుదైన వంగడాల సాగు

ప్రకృతి సాగులో వరి రకంలో కుంకంసాలు, ఒడిశా బాసుమతి, కాలాబట్టీ, నవారా రకం వరిని అనంతబాబు సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ సాధారణ సాగులో పంటకాలం 120 రోజులు కాగా ఈ అరుదైన రకం సాగుకు 150 రోజుల సమయం పడుతుంది. ఆయన తెలిపారు. ఆయా సాగులో పంటకోత ప్రయోగం చేయగా ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు వరకు దిగుబడి వస్తున్నట్లు చెప్పారు. 10 ఎకరాల్లో వరితో పాటు ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రియసాగు ద్వారా పండించిన వరిని వినియోగిస్తే వ్యాధులు దూరమవుతాని, అలాగే బీపీ, సుగర్, ఆస్తమా వంటి వ్యాధులు నయమవుతాయని చెప్పారు. పురాతన రకాలైన వరికి మార్కెట్లో బాగా గిరాకి ఉన్నట్లు తెలియజేశారు.




అనంతబాబు

యాప్‌లతో దారుణం

• మోసపోతున్న యువత





లోన్‌యాప్‌ల నెట్‌ఫొటోలు

అపరిచిత యాప్‌లపై అప్రమత్తం



చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని అపరిచిత యాప్ కనిపిస్తే అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రతి యాప్‌ను ఆయాచితంగా క్లిక్‌చేసే అలవాటుతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటారు. అడ్డుగోలుగా లోన్ యాప్‌లోకి వెళ్తే మీ వ్యక్తిగత సమాచారం వారి గుప్పెట్లోకి వెళ్తోంది. మోసపూరితంగా ఉంటున్న లోన్‌యాప్‌ల జోలికి దయచేసి వెళ్లొద్దు. నిర్వాహకులు వేధిస్తుంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా సంబంధిత బ్యాంకు అధికారులను కూడా సంప్రదించాలి.

– జి మురళీధర్, డీఎస్పీ, పార్వతీపురం

పార్వతీపురంటౌన్: సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో దారి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలితీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారి వలలో పడి రుణాలు తీసుకున్న అమాయకులు. తిరిగి చెల్లించలేనప్పుడు వారి వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. ఇటువంటి సంఘటనల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. నిర్వాహకుల వేధింపులు, పరువు, ప్రతిష్ఠలు రోడ్డున పడతాయనే భయంతో ఆందోళనలో ఏం చేయాలో తెలియక ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారు.

'ఈజీ రుణంతో వల

- లోన్ యాప్‌లో రుణం కోసం ఎటువంటి హామీ అవసరం లేదు.
- మొబైల్ ఉండి, లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.
- హామీ లేకుండా రూ.2,000 నుంచి రూ.50 వేల వరకూ యాప్‌లో లోన్ ఇస్తుంటారు.
- రుణం చెల్లింపుల్లో ఒక్క రోజు ఆలస్యమైనా లోన్ యాప్ నిర్వాహకులు ఉపేక్షించరు.
- లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా మొబైల్‌లోని వ్యక్తిగత డేటా (సమగ్ర సమాచారం) నిర్వాహకుల గుప్పిట్లోకి వెళ్లిపోతుంది.

'హామీ లేకుండా రుణాలతో వల

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. 'హామీ లేకుండానే రుణం పొందండి' అంటూ లోన్ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఇవి. హామీ అవసరమే లేదనడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆకర్షితులై తమ మొబైల్ లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వివరాలు ఇవ్వడమే ఆలస్యం. క్షణాల్లో రూ.50 వేల లోపు రుణం ఖాతాలో జమైపోతుంది. రుణం ఇచ్చేటప్పుడు హుందాగా వ్యవహరించే నిర్వాహకులు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైనా బెదిరింపులు, వేధింపులకు దిగుతున్నారు. డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే మొబైలోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు సహా అన్నింటికీ యాప్ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాలి. లేదంటే రుణం రాదంటారు. యాక్సెస్ ఇవ్వగానే రుణం తీసుకున్న వారి రుణ యాప్ సర్వర్లకు అనుసంధానమవుతుంది. అవసరార్థం అప్పు ఇస్తే చాలనుకునే సందర్భంలో షరతులు, నిబంధనలను చూసుకోకుండానే చాలామంది అంగీకరిస్తున్నారు. అదే వారి పాలిట యమపాశమవుతోంది.

ప్రైవేటు బ్యాంకుల్లోనైనా జాయింట్ ఖాతాలు తెరవొచ్చు.. : కలెక్టర్

విజయనగరం అర్బన్: విద్యార్థులకు వర్తించే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం విద్యార్థులు, వారి తల్లుల పేరుతో సంయుక్త బ్యాంక్ ఖాతాలను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో ఎక్కడైనా తెరవొచ్చని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం తెలిపారు. జీరో బేస్ట్ ఖాతాలను తెరిచేందుకు అన్ని బ్యాంకులు అంగీకరించాలని అందువల్ల విద్యార్థులు, వారి తల్లులు ఆయా బ్యాంకుల్లో ఏపీజీవీబీ, డీసీసీబీ సహా ఇతర బ్యాంకుల్లో ఎక్కడైనా తమ ఖాతాలను తెరచి పాస్‌బుక్ పొందవచ్చని పేర్కొన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

సాలూరు: పార్వతీపురం మండలంలోని పుత్తూరుకు చెందిన బంగారుదొర, కృష్ణారావులు ఓ శుభకార్యక్రమానికి హాజరయ్యేందుకు సాలూరు నుంచి మామిడిపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. వారిని మామిడిపల్లి నుంచి సాలూరు వస్తున్న ఆటో దత్తివలస సమీపంలో ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో బంగారుదొర, కృష్ణారావులకు గాయాలవగా, సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు బంగారుదొర ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170